
# కాంగ్రెస్ హయాంలో..
# కటిక చీకట్లు



**కాంగ్రెస్‌పై అన్నదాతలు** కన్నెర్ర చేశారు. టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డిపై మండిపడుతున్నారు. వ్యవసాయానికి మూడు గంటల విద్యుత్ చాలని, 10 హెచ్‌పీ మోటర్లతో మూడు గంటల్లో మూడు ఎకరాలు పారుతుందని మాట్లాడటంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ హయాంలో కటిక చీకట్లు రావడం ఖాయమని పేర్కొంటున్నారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత వ్యవసాయానికి 24గంటల విద్యుత్ సరఫరా చేయడంతో కర్షకులు సంతోషంగా రెండు పంటలు సాగు చేసుకుంటున్నారు. కాంగ్రెస్ నేతలు పనిగట్టుకొని నోటికొచ్చినట్లు మాట్లాడుతూ గందరగోళం సృష్టిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ హయాంలో కరెంట్ ఎప్పుడు వస్తుందో.. ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి ఉండేదన్నారు. మళ్లీ ఇప్పుడు కాంగ్రెస్‌కు అవకాశమిస్తే కరెంట్ కష్టాలతో పాటు రైతుల ఆత్మహత్యలు తప్పవంటున్నారు. సీఎం కేసీఆర్ తీసుకొచ్చిన ధరణితో భూ దందాలకు చెక్ పడింది. ఇంటికే పాస్‌బుక్కు వచ్చేలా ధరణిపోర్టల్‌ను రూపొందించారు. దీంతో నేడు ఎక్కడా భూసమస్యలు, తగాదాలు కనిపించడం లేదు. సమస్యలు పరిష్కారం కావడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

*- సంగారెడ్డి జిల్లా నెట్‌వర్క్, నవంబర్ 27*

### అప్పట్లో మోటర్లు కాలిపోతుండే..



కాంగ్రెస్ ప్రభుత్వంలో వోల్టేజీ సమస్యతో పదేపదే మోటర్లు కాలిపోతుండే. 2 ఫేస్ కరెంట్ ఉంటుండే, దాని వల్లన రైతులు పంట పొలాల వద్ద ఇబ్బంది పడేవారు. పొద్దునపోయిన కరెంట్ రాత్రికి వచ్చేది, ఆ కరెంట్ వోల్టేజీ సమస్యలతో మోటర్లు కాలిపోయేవి. మోటర్లు బాగు చేయలంటే రెండు, మూడు రోజులు పడుతుండే. టైమ్‌కి ఇవ్వడం కుదురకుండే. ఇప్పుడు ఆ తిప్పలు తప్పినవి. తెలంగాణ వచ్చిన తరువాత రైతులకు 24 గంటల నాణ్యమైన కరెంట్ ఇవ్వడంతో సంతోషంగా ఉన్నారు. వారు ఇష్టం వచ్చిన టైమ్‌కి పోయి పంటకు కావలసిన నీరును పార బెట్టుకుంటున్నారు. మోటర్లు రిపేరింగ్ చాలా తగ్గిపోయింది. కాంగ్రెసోళ్లు 3 గంటల కరెంటుకు, 10 హెచ్‌పీ మోటరు బిగిస్తే నీళ్లు తొందరగా ఒడుస్తవి. మడి కూడా తడువదు. సీఎం కేసీఆర్ రైతుల వెన్నంటే ఉంటూ వారి బాగోగులు చూసుకుంటున్నారు. మళ్లీ కేసీఆర్ ప్రభుత్వమే రావాలి.

*– మౌలానా, మోటరు మెకానిక్, సంగారెడ్డి అర్బన్*

### 24 గంటల కరెంటే బాగుంది..



రైతుల మేలు కోసం, వారు బాగు పడాలని సీఎం కేసీఆర్ వ్యవసాయానికి 24గంటల కరెంటు ఇస్తుండు. కాంగ్రెస్ వస్తే 3 గంటల కరెంటు ఇస్తామంటున్నారు. 3 గంటల కరెంటుతో రైతులకు ఇబ్బందులే తప్ప మరేమీ లేదు. వ్యవసాయానికి కరెంటు తక్కువ ఇస్తే, అందరు ఒకే సారి మోటర్లు చాలు చేస్తారు. మోటర్లపై లోడు పడి కాలిపోతాయి. పెట్టుబడి అంతా మోటర్ల రిపేర్లకే పెటాల్సి వస్తది. నిరంతరంగా కరెంటు ఉండటం మూలంగా వ్యవసాయం లాభ సాటిగా ఉంది. కాంగ్రెస్ వస్తే 3గంటల కరెంటు ఇచ్చి రైతులకు ఇబ్బందుల పాలు చేయటమే తప్ప, మేలు జరిగేది ఉండదు.

*– నర్సింలు, రైతు, అతిమ్యాల్, మనూరు మండలం*

### ధరణితోనే రైతులకు సరైన రక్షణ



ధరణితో రైతులకు సరైన రక్షణ. తెలంగాణ ప్రభుత్వానికి వస్తున్న ఆదరణ చూడలేక కాంగ్రెసోళ్లు అధికారంలోకి వస్తే ధరణి తీసేస్తామని మతి లేని మాటలు మాట్లాడుతున్నారు. ధరణి పోర్టల్‌తోనే రైతుల భూములకు భద్రత ఉంది. గతంలో దళారులకు ముడుపులు చెల్లిస్తేనే పనులు జరిగేవి. ధరణి వచ్చిన తర్వాతే జవాబుదారీగా పనులు జరుగుతున్నాయి. పట్వారీ వ్యవస్థలో ఎంతో మంది రైతుల భూములు తారుమారు చేసిన సంఘటనలున్నాయి. ధరణి తీసేస్తే పాత రోజులు వచ్చి రైతులకు తిప్పలు తప్పవు. రైతుకు మంచి చేస్తున్న ప్రభుత్వం బీఆర్ఎస్ ప్రభుత్వం. బీఆర్ఎస్‌కు ఓటు వేస్తా. మా ఊరు రైతులందరితో బీఆర్ఎస్‌కే ఓటు వేయిస్తా.

*– పి.రాజు రైతు, కొలంపేట గ్రామం, కంది మండలం*

### సీఎం కేసీఆర్ వల్లే 24 గంటల కరెంట్..



తెలంగాణ ఏర్పాటు కాక ముందు గ్రామాల్లో కరెంట్ ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి. కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యాక రైతులకు 24గంటల కరెంట్ ఉచితంగా అందిస్తున్నారు. గతంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు వ్యవసాయానికి కరెంట్ సరిగ్గా సరిపోక మోటర్లు కాలిపోతుండేవి. నీరులేక పొలాలు ఎండిపోయేవి. సీఎం కేసీఆర్ హయాంలోనే తెలంగాణ మొత్తం విద్యుత్ కాంతులతో ప్రకాశిస్తుంది. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే మూడోసారి ముఖ్యమంత్రి కేసీఆర్ అయితేనే అది సాధ్యం.

*– సంగమేశ్వర్, రైతు, బొడిశెట్‌పల్లి, మునిపల్లి మండలం*

### కాంగ్రెస్ వస్తే కరెంట్ సమస్యలు మళ్లీ వచ్చినట్లే..

కాంగ్రెస్‌కు ఓటు వేసి గెలిపిస్తే మళ్లీ కరెంట్ సమస్యను తెచ్చుకున్నట్లే. తెలంగాణ వస్తే కరెంట్ సమస్య వస్తుందని అప్పటి సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నాడు. కానీ, సీఎం కేసీఆర్ ఆరు నెలల్లోనే కరెంట్ సమస్యను తీర్చి 24గంటలు సరఫరా చేస్తుండు. కరెంట్ విషయంలో తెలంగాణ నంబర్‌వన్‌గా ఉంది. కాంగ్రెస్ హయాంలో పవర్ హాలిడేలు ఉండేవి. రోజులో మొత్తానికి 8 గంటలు కూడా సరిగ్గా కరెంట్ ఉండేది కాకుండే. ఎప్పుడు కరెంట్ పోతుందో తెలిసేది కాకుండే. కంపెనీలు బంద్ అయి కార్మికులు ఉద్యోగులు లేకుండా పోయాయి. అలాంటి పరిస్థితుల్లో నుంచి ఇప్పుడు తెలంగాణ కరెంట్ విషయంలో నంబర్‌వన్ స్థానంలో నిలిచింది. పరిశ్రమలకు, రైతులకు, వాణిజ్యసంస్థలకు, గృహోపకరణాలకు



24గంటల నిరంతర కరెంట్ సరఫరా చేస్తుండడంతో కరెంట్ సమస్యలు తెలుస్తలేవు. పరిశ్రమలు మూడు షిఫ్ట్‌లు నడుస్తున్నాయి. కార్మికులకు ఓటీలు దొరుకుతున్నాయి. అందరూ సంతోషంగా బతుకుతున్నారు. కాంగ్రెస్‌ను నమ్మి ఓటు వేస్తే అప్పటి రోజులకు తిరిగి తెచ్చుకున్నట్లు అవుతుంది. కాంగ్రెస్‌ను నమ్మే పరిస్థితి లేదు. బీఆర్ఎస్ వైపే నిలుస్తాం.

*– రవికుమార్, స్టీల్ దుకాణం యజమాని, రామచంద్రాపురం*

### రైతులు బాగుపడుడు కాంగ్రెస్‌కు ఇష్టం లేదు..



మూడు గంటల కరెంటిస్తే సాపెలుపు బీడు తడవదు. అసలు రైతులు బాగుపడుడు కాంగ్రెస్ పార్టీకి ఇష్టముండదు. ఎనుకటి నుంచి ఇదే తంతు. వాళ్లిచ్చే కరెంటుకు తెల్లందాక పొద్దందాక బోర్లకాడికి పోవాలే. పురుగు బుసి కుట్టి చావాలే. రైతులు ఇప్పుడు సుఖంగ బతుకుతున్నారు. వాళ్ల కండ్లు రైతుల మీద పడ్డాయి. రేవంత్‌రెడ్డి 10హెచ్‌పీ మోటరంటుడు. ఆ మోటరు నీళ్లు గుంచి పోస్తే భూమిల నీళ్లుంటాయా? ఎవ్వసం తెల్వని మాటలవి. కాంగ్రెసోళ్ల మూడు గంటల కరెంటొద్దు, 10 హెచ్‌పీ మోటరొద్దు. ఉన్నది ఉన్నట్లు ఉంచుకుంటాం. కేసీఆర్‌ను గెలిపించుకుంటాం.

*– నీరుడి రాములు, బీజిలీపూర్, వట్‌పల్లి మండలం*


### 10 హెచ్‌పీ మోటర్లు లేవు..



వ్యవసాయానికి మూడు గంటలు కరెంటు సరిపోతుంది, 10 హెచ్‌పీ మోటర్లను పెట్టుకోండని కాంగ్రెస్ నాయకులు చెబుతున్నారు. అంటే వారికి వ్యవసాయం గురించి తెలియదన్నమాట. కాంగ్రెస్ నాయకులు చెప్పే మాటలు నమ్మితే రైతులు ఆగమవుతారు. 10 హెచ్‌పీ మోటర్లు ఎవరి వద్ద కూడా లేవు. రైతులకు వాటిని ఎవరు కొని ఇస్తారు. అందరూ తక్కువ హెచ్‌పీ ఉన్న మోటర్లనే వాడుతారు. కాంగ్రెస్ మూడు గంటల పాటు కరెంటు ఇస్తే రైతులందరూ ఒకే టైంలో మోటర్లను స్టార్ట్ చేస్తరు. అప్పుడు లోడ్ పెరిగి మోటర్లు కాలిపోతాయి. తెలంగాణలో రైతులకు ఇలాంటి పరిస్థితి రాకూడదంటే సీఎం కేసీఆర్ హ్యాట్రిక్ ముఖ్యమంత్రి కావాలి.

*– గణేశ్‌రెడ్డి, రైతు, కోహీర్*


### మూడు గంటల కరెంటు ఏమూలకు సరిపోతది



కాంగ్రెస్ నాయకులు ఇస్తామంటున్న మూడు గంటల కరెంటు ఏమూలకు సరిపోతదని సూటిగా ప్రశ్నిస్తున్నా. కాంగ్రెస్ పాలనలో చాలీచాలని కరెంటుతో అనేక అవస్థలు పడ్డాం. ఆ బాధల నుంచి విముక్తి కలిగించేందుకు సీఎం కేసీఆర్ వ్యవసాయానికి 24గంటల నాణ్యమైన కరెంటు ఇస్తుంటే, ఎవుసం సంతోషంగా చేసుకుంటున్నాం. ఇప్పుడు కాంగ్రెస్ నాయకులు రైతులను కష్టాలపాలు చేయడానికి మూడు గంటల కరెంటు సరిపోతదని, 10 హెచ్‌పీ మోటర్లతో నీరు పారబెట్టుకోవచ్చు అనడం, రైతులను మోసం చేయడానికే. ఇప్పుడు తెలంగాణ ప్రభుత్వం అన్నివిధాలుగా రైతులను ఆదుకోవడంతో సీఎం కేసీఆర్ ప్రభుత్వానికే రైతన్నల మద్దతు ఇచ్చి, మళ్లీ బీఆర్ఎస్‌ను గెలిపించుకుంటాం.

*– గొల్ల శ్రీనివాస్, రైతు, హత్నూర*

### ధరణి తొలగిస్తే ఇబ్బందులు



రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ధరణి పోర్టల్‌తో భూసమస్యలు తొందరగా పరిష్కారమవుతున్నాయి. గతంలో భూములు అమ్మాలన్నా, కొనాలన్నా పొద్దంతా పడిగాపులు కాయాల్సివచ్చేది. రిజిస్ట్రేషన్ చేసుకున్నాక కొత్తగా పట్టాదారు పాసుపుస్తకంలో పేరు నమోదుకు రోజులుపట్టేది. మ్యుటేషన్ చేయడానికి పట్వారీలు ఇబ్బందులకు గురిచేసేవారు. ఇప్పుడు ఆ పరిస్థితులు లేవు. నిమిషాల్లో రిజిస్ట్రేషన్, వెంటనే పట్టాదారు పాసుపుస్తకంలో నమోదు చేస్తున్నారు. భూమి పత్రాలు కావాలన్నా సులభంగా తీసుకుంటున్నాము. అన్ని వివరాలు ధరణిలోనే లభిస్తున్నాయి. అవగాహన లోపంతో కాంగ్రెస్ నాయకులు ధరణి తొలగిస్తామని ప్రకటించడం రైతులను ఇబ్బందులకు గురిచేయడమే.

*– విఠల్‌రెడ్డి, రైతు సమన్వయసమితి సభ్యుడు, కొన్యాల, హత్నూర*

### కరెంట్ మూడు గంటలైతే మునుగుడే

రేవంత్‌రెడ్డి చెప్పినట్లు మూడు గంటల కరెంట్ అయితే రైతులు నిండా మునిగిపోతారు. మతి ఉండి మాట్లాడుతున్నారో.. మతి తప్పి మాట్లాడుతున్నారో అర్థం కావట్లేదు. 10 హెచ్‌పీ మోటర్లు అంటే మళ్లీ రైతులకు ఆగం చేసుడు తప్ప మరేం లేదు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం రోజుకు రెండు, మూడు గంటల కరెంట్ ఇచ్చినప్పుడు వ్యవసాయంతో పాటు చిన్న పరిశ్రమలు కూడా మూతపడ్డాయి. సీఎం కేసీఆర్ చేసిన ఆలోచనలతో రైతుల కష్టాలు ఆగినాయ్. 24 గంటల కరెంట్ ఇచ్చే బీఆర్ఎస్‌ను కాదని కాంగ్రెస్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మబోం. ఆనాడు రైతులను అరిగోస పెట్టిన సంగతి ఎవ్వరూ మరువలేదు.

*– బసిరెడ్డి, రైతు, చీలేపల్లి గ్రామం, ఝరాసంగం మండలం, సంగారెడ్డి జిల్లా*

